క్లుప్తంగా

ఘనంగా దేవలమహర్షి జయంతి



గూడూరు: దేవాంగ కులస్తుల మూలపురుషుడు దేవల మహర్షి జయంతి వేడుకలను మండలంలోని కప్పలదొడ్డిలో ఘనంగా నిర్వహించారు. కప్పలదొడ్డి దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలలో దేవల మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ దేవాంగ కుల సంప్రదాయాలు రాబోవు తరాల వారికి తెలియపర్చే విధంగా ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సర్పంచి యక్కల మాధవి, ఎంపీటీసీ సభ్యురాలు పేరిశెట్టి తేజోవతి, దేవాంగ సంక్షేమ సంఘం సభ్యులు ములకల శ్యామలరావు, మేడక విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

24న మండలంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

నాగాయలంక: మండలంలోని నాగాయలంక, భావదేవరపల్లి, గణపేశ్వరం, ఏటిమొగ విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని అన్ని గ్రామాల్లో 24వ తేదీ సోమవారం ఉదయం 7 నుంచి 9 గంటల వరకు కరెంటు నిలిపివేస్తామని మండల విద్యుత్ శాఖ ఏఈ ఏడుకొండలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అవనిగడ్డలోని 132 కె.వి. సబ్‌స్టేషన్‌లో లైన్ల మరమ్మతులు చేపడుతున్న కారణంగా విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు చెప్పారు. ఈ ముందస్తు సమాచారం పరిగణనలోకి తీసుకుని వినియోగదారులు సంస్థకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పైడమ్మ దేవాలయం వ్యవస్థాపకుడు మృతి



పెడన: పట్టణంలోని ప్రసిద్ధ దేవాలయం పైడమ్మ దేవస్థానం వ్యవస్థాపకుడు, చైర్మన్ తోట నాగేశ్వరరావు(90) శుక్రవారం మృతి చెందారు. ఈయన కొంతకాలంగా అనారోగ్యానికి గురై మచిలీపట్నంలోని ఒక ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మరణించారు. ఏడాదిన్నర కిందట ఈయన భార్య వాయుసూతమ్మ మృతిచెందింది. ఈయనకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు. ఈయన మృతి పట్ల ఆలయ ఈవో టీవీవీ మోహనరావుతో పాటు ఆలయ కమిటీ సభ్యులు, పలు పార్టీల నాయకులు సంతాపం తెలియజేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

వయోవృద్ధులకు ఉచిత న్యాయసహాయం

చిలకలపూడి(మచిలీపట్నం): పేదలకు, వయోవృద్ధులకు ఉచిత న్యాయ సహాయం అందించటమే న్యాయసేవాధికార సంస్థ లక్ష్యమని సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య అన్నారు. స్థానిక సర్కారుతోటలోని వాసవీ వృద్ధాశ్రమంలో శుక్రవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ తల్లిదండ్రులను చూడని పిల్లలపై చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందన్నారు. వృద్ధాశ్రమంలో వసతి సౌకర్యాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో న్యాయవాది అజ్మతున్నీసా, వృద్ధాశ్రమం ప్రతినిధి తాడేపల్లి మల్లికార్జునరావు, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో బ్యాక్‌లాగ్ సీట్లకు ప్రవేశ పరీక్ష

మోపిదేవి: మోపిదేవి మహాత్మా జ్యోతిబాపూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలో వివిధ జిల్లాల్లో 6,7,8,9 తరగతిలో బ్యాక్‌లాగ్ సీట్లకు ప్రవేశ పరీక్ష నిర్వహిచినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ కె.వీర రవి శుక్రవారం తెలిపారు. ఈనెల 20, 21 తేదీల్లో రెండు రోజుల పాటు ప్రవేశ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. 6, 8 తరగతులకు ఈనెల 20వ తేదీ నిర్వహించగా 6వ తరగతికి 225 మంది దరఖాస్తులు చేసుకోగా 125 మంది పరీక్షకు హాజరైనట్లు తెలిపారు. 8వ తరగతికి 179 మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకోగా 90 మంది హాజరైనట్లు తెలిపారు. 21వ తేదీన నిర్వహించిన 7వ తరగతి పరీక్షకు 199 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 108 మంది హాజరైనట్లు చెప్పారు. 9వ తరగతికి దరఖాస్తు చేసుకున్న 139 మంది విద్యార్థుల్లో 79 మంది పరీక్షలు హాజరైనట్లు వివరించారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

పెడన: పట్టణంలోని పలు వార్డుల్లో పారిశుద్ధ్య పరిస్థితి అధ్వానంగా ఉన్నట్లు వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో స్వయంగా పరిశీలించి పరిష్కార చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ బి.వెంకటరామయ్య అన్నారు. ఆయన శుక్రవారం పట్టణంలోని 11వ వార్డు హనుమాన్‌కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆ వార్డులో సీసీ రోడ్డుపై పలు గృహాల వాడకం నీరు పారుతుండటాన్ని పరిశీలించి గృహస్తులతో మాట్లాడి పలు సూచనలు జారీ చేశారు. మురుగునీటికి గుంతలా తవ్వి అందులో నిల్వ ఉండేలా చూడాలని, ఎండ బాగా వేసినప్పుడు ఆ నీటిని తోడేసుకోవాల్సిందిగా సూచించారు. నీరు ఎక్కువ రోజులు నిల్వలేకుండా చూడాలని తెలిపారు. సచివాలయాల శానిటేషన్ కార్యదర్శులకు స్పష్టమైన ఆదేశాలు ఇస్తూ రోడ్లపై మురుగునీరు పారుదల లేకుండా చూడాలని తెలిపారు.

ఒత్తిడి నివారణకు దివ్యౌషధం యోగా

మచిలీపట్నంటౌన్: యోగాతో శారీరక, మానసిక ఒత్తిడి నివారించవచ్చని పలువురు వక్తలు పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం నగరంలోని పలు విద్యా సంస్థల్లో నిర్వహించారు. నగరంలోని లేడీ యాంప్తిల్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన జిల్లా ఇంటర్మీడియెట్ వృత్తి విద్యా శాఖాధికారి పీబీ సాల్మన్‌రాజు మాట్లాడుతూ వ్యక్తి, సమాజ వికాసానికి యోగా ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎ.ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ ప్రపంచ మానవాళికి మన దేశం ఇచ్చిన కానుక యోగా అన్నారు. యోగా గురువులు ప్రసాద్, రాజకుమారి, రేఖ, విజయలక్ష్మి, వరలక్ష్మి, నర్మద, నాంచారయ్య విద్యార్థినులతో యోగాసనాలు వేయించారు.

నోబుల్ కళాశాలలో...

స్థానిక నోబుల్ కళాశాలలోని ఎన్‌సీసీ 87 సీఓఆర్, ఆంధ్రా 16 బెటాలియన్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎన్‌సీసీ క్యాడెట్‌లు యోగాసనాలు వేశారు. యోగాసనాలతో కలిగే ప్రయోజనాలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌జే ఎర్నెస్ట్ వివరించారు. ఎన్‌సీసీ కేర్ టేకర్ కేఎస్ సందీప్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

యోగా సభ ఆధ్వర్యంలో రక్తదానం

యోగాసభ ఆధ్వర్యంలో స్థానిక చింతగుంటపాలెంలోని యోగాసభ కార్యాలయ ప్రాంగణంలో యోగ సాధకులు రక్తదానం చేశారు. 11 మంది రక్తాన్ని దానం చేశారు. రక్తదాన శిబిరాన్ని ఇండియన్ రెడ్‌క్రాస్ జిల్లా శాఖ కార్యదర్శి భవిరి శంకర్‌నాథ్ ప్రారంభించారు. కార్యక్రమంలో అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ బొర్రా విఠల్, జనసేన నాయకుడు మాదివాడ రాము, రెడ్‌క్రాస్ సొసైటీ మెడికల్ ఆఫీసర్ హనుమంతయ్య తదితరులు పాల్గొన్నారు. యోగాసభ ప్రతినిధులు రామిశెట్టి దుర్గాప్రసాద్, పల్లపోతు కృష్ణలను ఘనంగా సత్కరించారు.

బీజేపీ ఆధ్వర్యంలో...

నగరంలోని పోర్టురోడ్ మెహర్‌బాబా ఆడిటోరియంలో శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ధూళిపాళ శ్రీరామచంద్రమూర్తి, వైవీఆర్ పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా విశ్వ విద్యాలయంలో...

కోనేరుసెంటర్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చొరవతో యోగాకు అంతర్జాతీయ గుర్తింపు లభించిందని, నేడు 170కి పైగా దేశాల్లో యోగాను ఆచరిస్తున్నారని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి.జ్ఞానమణి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కృష్ణా విశ్వవిద్యాలయం లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కృష్ణా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ప్రధాన ఆచార్యులు ఎస్.ఉష అధ్యక్షత వహించారు. బయోటెక్నాలజీ సహాయ ఆచార్యులు ఎల్.సుశీల యోగాసనాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో పరీక్షల నియంత్రణ అధికారి కిరణ్ కుమార్, కంప్యూటర్ సైన్స్ విభాగం ఆచార్యులు సుందర కృష్ణ పలువురు ఆచార్యులు, సహాయ ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గూడూరులో...

గూడూరు: మండలంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి -2 పి.సుబ్రహ్మణ్యం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పాఠశాల హెచ్ఎం డి.పుష్పలత ఆధ్వర్యంలో విద్యార్థులు యోగాసనాలు వేశారు. పీడీ మత్తి అరుణ, పి.ఎస్.ప్రసాద్, ఎన్‌సీసీ హవల్దార్ నాసర్ హుస్సేన్, ప్రసన్న, ఉపాధ్యాయులు, ఎన్‌సీసీ కేడెట్లు తదితరులు పాల్గొన్నారు.

పెడనలో...

పెడన: మానసిక, శారీరక ఒత్తిళ్లను అధిగమించడానికే కాకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి యోగా ఎంతో దోహదం చేస్తుందని ఆంధ్రప్రదేశ్ సహజ యోగా ట్రస్ట్ సామూహిక శిక్షకురాలు ఎస్.రాధిక అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో శుక్రవారం యోగా తరగతులను నిర్వహించారు. కార్యక్రమంలో పెడన ఎంఈవో -2 వైవీ హరనాథ్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ట్రస్ట్ కోఆర్డినేటర్ ఎస్.సుబ్రమణ్యం పాల్గొన్నారు.

- మండలంలోని పల్లోటి ఉన్నత పాఠశాలలో కరస్పాండెంట్ ఫాదర్ జోజిరెడ్డి విద్యార్థులకు యోగా తరగతులను నిర్వహించడంతో పాటు యోగా వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రిన్సిపాల్ రాజీవ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.
- నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో నందమూరు జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు యోగా తరగతులను నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో కళాశాల అధ్యాపకుడు రమేష్ యోగా గురించి విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీఎస్ఎన్ రెడ్డి, పాఠశాల హెచ్ఎం ప్రభాకరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.
- పెడన బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మచిలీపట్నంకు చెందిన యోగా శిక్షకుడు మద్దాల చింతయ్య విద్యార్థులకు యోగాలో శిక్షణ ఇచ్చారు.

బంటుమిల్లిలో...

బంటుమిల్లి: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా స్థానిక కాంతి కేంద్రం సేవా ట్రస్ట్ భవనంలో శుక్రవారం పలువురు ఔత్సాహికులు ధ్యానం, సూర్యనమస్కారాలు చేశారు. అనంతరం యోగా కేంద్రం ఏర్పాటు చేసిన నిర్వాహకుడు జల్లూరి వాసును ఘనంగా సత్కరించారు. స్థానిక జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో న్యాయమూర్తి ఎం.భాస్కరరావు పర్యవేక్షణలో యోగా గురువు వెంకటేశ్వరరావు న్యాయవాదులు, కోర్టు సిబ్బందితో యోగా చేయించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.జగన్‌మోహన్‌రావు,అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘంటసాలలో...

గోగినేనిపాలెం(ఘంటసాల): ఘంటసాల మండలం గోగినేనిపాలెం జెడ్పీ హైస్కూల్లో హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు తమ్మన వేణుగోపాలరావు ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ జి.మారుతి యోగా దినోత్సవం గురించి వివరించారు. విద్యార్థులతో సూర్య నమస్కారాలు, యోగాసనాలు వేయించారు. జెడ్పీ ఆంగ్ల ఉపాధ్యాయులు, మెడిటేషన్ మాస్టర్ ట్రైనర్ ఆర్.సుబ్బారావు ధ్యానం వలన కలిగే లాభాలను వివరించారు. ధ్యానం చేసే విధానాన్ని చేసి చూపించారు.

కోడూరులో...

కోడూరు: ప్రతి రోజు యోగా చేయడం వల్ల ఆరోగ్యంతో ఉండడంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎంఈఓ టి.వి.ఎం.రామదాసు అన్నారు. కోడూరులోని స్వతంత్రపురం జెడ్పీ పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులతో యోగా చేయించారు. అనంతరం యోగా ఆవశ్యకతను వివరిస్తూ ప్రధాన రహదారుల వెంట విద్యార్థులు, ఉపాధ్యాయులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆలా వెంకటరమణ, పీఈటీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చల్లపల్లిలో...

చల్లపల్లి(అవనిగడ్డ): స్థానిక ఎన్‌టీఆర్ పార్కులో శుక్రవారం ప్రపంచ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ భారతదేశం అందించిన యోగాను ఐక్యరాజ్య సమితి గుర్తించిందన్నారు. శారీరక, మానసిక వికాసం అందించే యోగా భారత దేశంలో వేదకాలం నుంచి ఉందన్నారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలకు యోగా నేర్పించడం ద్వారా మానసిక ఒత్తిళ్లను దూరం చేయవచ్చని చెప్పారు. ఈ సందర్భంగా యోగా గురువు శ్రీనివాస్ ప్రత్యేక యోగాసనాలు వేయించారు. అనంతరం శ్రీనివాస్‌కు బుద్ధప్రసాద్ ప్రత్యేక జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో స్వచ్ఛసుందర చల్లపల్లి కన్వీనర్లు డాక్టర్ డీఆర్‌కే ప్రసాద్, డాక్టర్ పద్మావతి, బీజేపీ నాయకులు తుంగల వెంకట గిరి, ఉప సర్పంచ్ ముమ్మనేని నాని, విశ్రాంత ఈవోపీఆర్‌డీ దాసి సీతారామరాజు, పౌరాణిక కళాకారుడు బోలెం రామారావుతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



మచిలీపట్నం పోలీస్ పరేడ్ మైదానంలో యోగాసనాలు వేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ నయీమ్ అస్మి, ఇతర అధికారులు

యోగాసనాలు వేసిన ఉపాధి కూలీలు

నాగాయలంక: అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని మహాత్మా గాంధీజీ జాతీయ ఉపాధి హామీ పథకం(ఎంజీఎన్ఆర్ఈజీఎస్)మండల శాఖ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో పలుచోట్ల యోగా దినోత్సవం జరిపారు. ఏపీఓ టి.వి.ఎన్ ముత్యాలు పర్యవేక్షణలో మండలంలోని భావదేవరపల్లి, టి.కొత్తపాలెం, తలగడదీవి, ఏటిమొగ, పర్రచివర, నాచుగుంట గ్రామాల్లోని అమృత్ సరోవర్ ట్యాంకులు (సేద్యపు నీటి కుంటలు)వద్ద యోగా దినోత్సవం జరిపి యోగా విశిష్టత, ప్రాధాన్యతలను వివరించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలు, గ్రామస్తులు, ప్రజాప్రతినిధులుతో ఆసనాలు వేయించి వాటి వలన కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. భావదేవరపల్లి సర్పంచి మండలి ఉదయభాస్కర్, కొత్తపాలెం సర్పంచి బండ్రెడ్డి శివపార్వతి, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



భావదేవరపల్లి అమృత్ సరోవర్ ట్యాంకు వద్ద యోగా దినోత్సవంలో ఉపాధి కూలీలు



మోపిదేవిలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు



ఘంటసాల మండలం గోగినేనిపాలెం హైస్కూల్లో యోగాసనాలు చేస్తున్న విద్యార్థులు



చల్లపల్లిలో యోగా గురువుకు జ్ఞాపిక అందిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్



మచిలీపట్నం నోబుల్ కళాశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు



యోగసభ ఆధ్వర్యంలో రక్తదానం చేస్తున్న సభ్యులు



పెడన బంగ్లా స్కూలులో యోగా చేస్తున్న విద్యార్థులు



గూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు



మచిలీపట్నం లేడీ యాంప్తిల్ కళాశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థినిలు

దేశ ప్రగతిలో కర్షకులదే కీలక పాత్ర

- మొవ్వ ఏడీఏ శ్యామల
- తాడేపల్లి గ్రామంలో ఘనంగా ఏరువాక పూర్ణిమ ఉత్సవం

తాడేపల్లి(ఘంటసాల): దేశ ప్రగతిలో రైతులదే కీలక పాత్ర అని మొవ్వ ఏడీఏ ఎస్.శ్యామల అన్నారు. ఘంటసాల మండలం తాడేపల్లి గ్రామంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఏరువాక పూర్ణిమ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పంట పొలాల్లో రైతులతో కలసి ఎడ్లతో నాగలి కట్టి దుక్కి దున్నడంతో పాటు వరి విత్తనాలు చల్లి వ్యవసాయ పనులను ఏడీఏ శ్యామల, మండల వ్యవసాయశాఖ అధికారి కె.మురళీ కృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు తుమ్మల చౌదరి బాబు రైతులతో కలసి ప్రారంభించారు. అనంతరం ఏడీఏ శ్యామల మాట్లాడుతూ మొవ్వ సబ్ డివిజన్ పరిధిలోని మొవ్వ, ఘంటసాల, చల్లపల్లి మండలాల్లో 44 రైతు భరోసా కేంద్రాల పరిధిలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 23,834 హెక్టార్లలో పంటలు సాగు చేస్తారని అంచనాలు వేసినట్లు చెప్పారు. ఇప్పటికే వరి విత్తనాలు, పచ్చిరొట్ట విత్తనాలు సరఫరా చేశామని, రైతులకు కావాల్సిన ఎరువులు కూడా అందుబాటులో ఉంచడానికి తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో రైతులు బండి పరాత్పరరావు, సూరపనేని ప్రసాద్, ఆదర్శరైతు ఉప్పల ప్రసాద రావు, యార్ల శ్రీకాంత్, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.



తాడేపల్లిలో వ్యవసాయ పనులు ప్రారంభిస్తున్న ఏడీఏ శ్యామల, ఏవో మురళీకృష్ణ, చౌదరి బాబు

బీఎస్ఎంఎల్ ఫౌండేషన్ సేవలు ఆదర్శనీయం

- ఎంపీడీఓ మారుతీ శేషమాంబ
- 75 మంది దివ్యాంగులకు స్కిల్ డెవలప్‌మెంట్ సర్టిఫికెట్ల పంపిణీ

ఘంటసాల: బెస్ట్ సోషల్ సర్వీస్ మేనేజ్‌మెంట్ లైఫ్ ఫౌండేషన్(బీఎస్ఎంఎల్) దివ్యాంగులకు అందిస్తున్న సేవలు ఆదర్శనీయమని ఘంటసాల ఎంపీడీఓ బి.మారుతి శేషమాంబ అన్నారు. ఘంటసాల మండలం చిలకలపూడి గ్రామంలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో 75 మంది దివ్యాంగులకు స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సు నిర్వహించారు. కోర్సులు పూర్తి చేసిన దివ్యాంగులకు శుక్రవారం ఎంపీడీఓ మారుతి శేషమాంబ చేతుల మీదుగా సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ గుత్తికొండ కిషోర్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరరావు, ఫౌండేషన్ చైర్మన్ పెనుమాక బాలు, సిబ్బంది, దివ్యాంగులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న ఎంపీడీఓ మారుతి శేషమాంబ, ఫౌండేషన్ చైర్మన్ బాలు

కుష్టు, బోద వ్యాధిగ్రస్తులకు వడ్డీ రహిత రుణాలు

పెడన/మచిలీపట్నంటౌన్: కుష్టు, బోద వ్యాధిగ్రస్తులకు రాష్ట్ర ప్రభుత్వం వైద్యపరంగా సహాయ సహకారాలను అందజేయడంతో పాటు మ్యాన్‌కైండ్ సంస్థ ద్వారా వారికి సూక్ష్మ వడ్డీ రహిత రుణాలను ఇవ్వడం అభినందనీయమని జిల్లా మలేరియా అధికారి రామారావు అన్నారు. పెడన 18వ వార్డులో సచివాలయం వద్ద శుక్రవారం నలుగురు బోద వ్యాధిగ్రస్తులకు వడ్డీ రహిత సూక్ష్మ రుణాలను ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున అందజేశారు. లెప్రా సొసైటీ ప్రాజెక్టు అసోసియేట్ అబ్దుల్ వహీద్‌బాషా, సొసైటీ కో ఆర్డినేటర్ రాధిక, నాగమణి పాల్గొన్నారు. మచిలీపట్నం18వ డివిజన్ సచివాలయం వద్ద శుక్రవారం బోదవ్యాధిగ్రస్తులకు జిల్లా మలేరియా అధికారి డి.రామారావు వడ్డీలేని రుణాలను అందజేశారు. రూ.10 వేల చొప్పున నలుగురికి ఈ రుణాలు అందించారు.



బోదవ్యాధిగ్రస్తులకు రుణాలను అందజేస్తున్న జిల్లా మలేరియా అధికారి రామారావు

కనులపండువగా రామలింగేశ్వరుని రథోత్సవం

మచిలీపట్నంటౌన్: నగరంలోని రాబర్ట్సన్‌పేటలో ఉన్న చారిత్రక శ్రీ రామలింగేశ్వరస్వామి, శ్రీ రంగనాయకస్వామి వారి ఆలయాల్లో స్వామివార్ల కల్యాణ బ్రహ్మోత్సవాలు శుక్రవారం వైభవోపేతంగా నిర్వహించారు. స్వామివారి రథోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో శ్రీ దుర్గామల్లేశ్వరి కళా పీఠం వారు ప్రదర్శించిన శ్రీ రామాంజనేయ యుద్ధం నాటకంలోని వార్‌సీన్ ఆహూతులను అలరించింది. చలమలశెట్టి గాంధీనాయుడుతో పాటు పలువురు కళాకారులు నటించారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ బి.సుబ్బారెడ్డి పర్యవేక్షించారు.

- శ్రీ రంగనాయకస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం అవభృదోత్సవం, పూర్ణాహుతి, ధ్వజ అవరోహణం వంటి పూజా కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారిని హనుమంత వాహనంపై నగర వీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమాలను ఆలయ ఈవో కందుల వేణుగోపాలరావు పర్యవేక్షించారు.
- నగరంలోని జగన్నాథపురంలో ఉన్న శ్రీ రుక్మిణి, సత్యభామ సమేత శ్రీ జగన్నాథస్వామి వారి కల్యాణ మహోత్సవాలు రెండో రోజైన శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నవకుంభారాధన, పంచామృత కలశారాధన, చతుర్దశ కలశ ఆవాహనం, విశేష మహాకుంభాభిషేకం, నిత్యహోమం, మహాశాంతి హోమం, విశేష అర్చన, నీరాజన మంత్రపుష్పములు నిర్వహించారు. స్వామివారి ఎదుర్కోలు ఉత్సవాన్ని నిర్వహించిన అనంతరం ఆలయంలో రుక్మిణి, సత్యభామ సమేత జగన్నాథస్వామి వారి దివ్య తిరుకల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు. కాపవరపు శ్రీనివాసబాబు - శ్రీలక్ష్మి దంపతులు పీటలపై కూర్చున్నారు.కార్యక్రమాలను ఆలయ ఈఓ గోవాడ వెంకట కృష్ణారావు పర్యవేక్షించారు.

కనులపండువగా శ్రీవారి వసంతోత్సవం

కోడూరు: కోడూరు శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామివారి వసంతోత్సవాన్ని శుక్రవారం కనులపండువగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, తిరువారాధన అనంతరం ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. పండితులు మొవ్వ రఘుశేఖరప్రసాద్ వ్యాఖ్యాతగా వ్యవహరించి బ్రహ్మోత్సవాల విశిష్టతను వివరించారు. అనంతరం భక్తులు రంగుల నీళ్లను ఒకరి మీద ఒకరు చల్లుకుంటూ వసంతోత్సవాన్ని నిర్వహించారు. శ్రీచక్రస్నాన ఉత్సవాన్ని కమనీయంగా జరిపారు. యాగశాలలో నిర్వహిస్తున్న హోమ క్రతువులను ముగిస్తూ మహాపూర్ణాహుతి కార్యక్రమాన్ని కనులపండువగా నిర్వహించారు. కృష్ణాపురం గ్రామానికి చెందిన ఇంకొల్లు మురళీకృష్ణ దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించి శేషవాహనానికి పూజలు చేశారు. అనంతరం ప్రత్యేక వాహనంపై కల్యాణమూర్తులను యర్రారెడ్డివారిపాలెం, ఇస్మాయిల్‌బేగ్‌పేట, కృష్ణాపురం గ్రామాల్లో ఊరేగించి, తిరువీధి ఉత్సవాన్ని నిర్వహించారు. జరుగువానిపాలెం గ్రామానికి చెందిన శ్రీనివాస భక్తసమాజం సభ్యులు స్వామివారి సంకీర్తనలను ఆలపించారు. రాత్రికి ధ్వజా అవరోహణం జరిపి సంతానం లేని మహిళలకు గరుడ ప్రసాదాన్ని అందించారు. శనివారం ఉదయం శాంతి కల్యాణం, రాత్రికి శ్రీపుష్పయాగం, ద్వాదశ ప్రదక్షిణలు, పవళింపు సేవ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ధర్మకర్త కోట పద్మావతి వరప్రసాద్ తెలిపారు.



వసంతోత్సవంలో భాగంగా వడ్లు దంచుతున్న మహిళలు

సమర్థంగా పనిచేసి ప్రజల మన్ననలు పొందాలి

ఘంటసాల: పంచాయతీ కార్యదర్శులుగా నూతనంగా బాధ్యతలు నిర్వహిస్తున్న ప్రతి ఒక్కరూ సమర్థంగా పనిచేసి ప్రజా ప్రతినిధులు, ప్రజల మన్ననలు పొందాలని ఎంపీడీఓ బి.మారుతీ శేషమాంబ అన్నారు. మండలంలోని దేవరకోట, వేములపల్లి, తాడేపల్లి, గోగినేనిపాలెం, మల్లాయి చిట్టూరు, పూషడం, ఎండకుదురు, కొత్తపల్లి, చిలకలపూడి, వి.రుద్రవరం, అచ్చెంపాలెం పంచాయతీలకు బదిలీపై వచ్చిన కార్యదర్శులు శుక్రవారం తమ జాయినింగ్ లెటర్స్‌ను ఎంపీడీఓకు సమర్పించారు. ఈ సందర్భంగా శేషమాంబ మాట్లాడుతూ ప్రతి పంచాయతీ కార్యదర్శి సక్రమంగా విధులు నిర్వహిస్తూ ప్రజలకు, ప్రభుత్వానికి అనుసంధానంగా పనిచేస్తూ గ్రామాల్లో సుపరిపాలన అందించాలన్నారు.



ఎంపీడీఓ శేషమాంబకు జాయినింగ్ లెటర్స్ ఇస్తున్న పంచాయతీ కార్యదర్శులు

దరఖాస్తు గడువు 30 వరకు పొడిగింపు

ఘంటసాల: వ్యవసాయ పాలిటెక్నిక్ కోర్సులకు సంబంధించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే గడువు జూన్ 30 వరకు పొడిగించినట్లు ఘంటసాల వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.సత్యప్రియ లలిత శుక్రవారం తెలిపారు. ఘంటసాల పాలిటెక్నిక్ కళాశాలలో ఆమె మాట్లాడుతూ గుంటూరు లాంఫు చెందిన ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం పరిధిలో 2024-25 విద్యా సంవత్సరానికి వ్యవసాయ పాలిటెక్నిక్ కోర్సుల్లో జాయిన్ అయ్యే వారికి ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 30 వరకు గడువు పొడిగించినట్లు తెలిపారు.

రోడ్డు ఆక్రమించి షెడ్డు నిర్మాణం

కోడూరు: పంచాయతీ రోడ్డును ఆక్రమించి షెడ్డు నిర్మాణం చేపట్టిన జనసేన పార్టీకి చెందిన వ్యక్తిపై సదరు పంచాయతీ కార్యదర్శి పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేశారు. మండలంలోని విశ్వనాథపల్లి గ్రామానికి చెందిన గోళ్ల కొండలు తన నివాస గృహానికి ఆనుకుని ఉన్న పంచాయతీ రోడ్డును గతంలో ఆక్రమించుకునేందుకు ప్రయత్నించగా, గ్రామస్తుల ఫిర్యాదుతో అప్పట్లో పంచాయతీ అధికారులు ఆ చర్యను అడ్డుకున్నారు. ఇటీవల ఎన్నికల్లో జనసేన పార్టీ అధికారంలోకి రావడంతో శుక్రవారం మళ్లీ రోడ్డును ఆక్రమించి షెడ్డు నిర్మాణం చేశాడు. దీంతో ఈ ఘటనపై కోడూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పంచాయతీ కార్యదర్శి ఏడుకొండలు తెలిపారు.